క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి బీమా నగదును అందిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసాకు చెందిన మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమాను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రజువారం గుండెపోటుతో మృతి చెందిన ఈవీవీ సత్యనారాయణ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10 వేలు మంజూరయ్యాయన్నారు. ఆ నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందించామని తెలిపారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ అకౌంట్ లో జమ అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు వెల్ఫేర్ కార్యదర్శి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ వ్యక్తుల వాహనాలు



ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రి ఆవరణలో పార్క్‌చేసిన ప్రైవేట్ వాహనాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద గల ఎఫ్‌ఆర్‌యూ ఆసుపత్రి ప్రాంగణంలో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు తమ కార్లు, ద్విచక్ర వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఇక్కడ అంబులెన్స్, ఆసుపత్రికి వచ్చే వైద్య నిపుణుల కోసం జీవీఎంసీ అధికారులు షెడ్ నిర్మించారు. వైద్యుల కంటే ముందు స్థానికంగా ఉన్న కొంత మంది తమ కార్లను ఇక్కడ పార్క్ చేసి రోజుల తరబడి విడిచిపెట్టి వెళ్లిపోతున్నా రు. దీంతో ఇక్కడికి వచ్చే వైద్యులు తమ కార్ల ను వేరే చోట పార్క్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే కొంత మంది తమ ద్విచక్ర వాహనాలను ఇక్కడి షెడ్‌లో పార్క్ చేస్తున్నారు. ఈ విషయమై ఇక్కడి సెక్యూరిటీ ప్రశ్నిస్తే వారు దురుసుగా సమాధానం చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

పేద మహిళలకు వితరణ



పేదలకు చీరలను ఇస్తున్న కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్ నగర్ వద్ద నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు భోగవల్లి నాగభూషణం, సత్యాల మహేష్, ఉరుకూటి బాబూరావుయాదవ్, ముప్పిడి వెంకటగిరి తదితరులు పాల్గొని సుమారు 50 మంది మహిళలకు చీరలు అందజేశారు. వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తమ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మజ్జి రమేష్, పట్నాల అప్పారావు, మరిపిల్లి నూకరాజు, వై. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వాహనాలకు రక్షణేదీ..!

- సర్వీస్ రోడ్డులోనే టూ వీలర్ల పార్కింగ్
- దొంగతనానికి గురవుతున్న వైనం
- పట్టించుకోని యాజమాన్యం



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటును ఆనుకుని పార్క్‌చేసిన కార్మికుల ద్విచక్ర వాహనాలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ సంస్థ) అభివృద్ధికి శ్రమిస్తున్న కార్మికుల వాహనాలకు రక్షణ కరువైంది. వేతనం తక్కువైనా కుటుంబ పోషణ నిమిత్తం 20, 30 కిలో మీటర్లు దాటి పనులకు వస్తున్నారు. సంస్థ ఆవరణలో వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తమ ద్విచక్ర వాహనాల కోసం పార్కింగ్ స్థలాన్ని కేటాయించండని ఎంత కోరినా.. యాజమాన్యం మాత్రం స్పందించడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఫలితంగా వారి ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ మాయం కావడం, ఒక్కోసారి వాహనాలే దొంగతనానికి గురవడం జరుగుతున్నాయి. ఈ ఘటనలతో తమ వాహనాలకు రక్షణ కూడా లేకుండా పోయిందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ పెట్రోల్ మాయం!

హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో రెండేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇవి చేసేందుకు అనకాపల్లి, చోడవరం, సబ్బవరం ఇలా పలు దూర ప్రాంతాల నుంచి కార్మికులతోపాటు స్థానిక కార్మికులు సుమారు రెండు వేల మంది వరకు రోజూ వస్తుంటారు. దూర ప్రాంతాలు కావడంతో సమయానికి బస్సులు అందుబాటులో ఉండని కారణంతో వారు ద్విచక్ర వాహనాలపై ఇక్కడికి వస్తుంటారు. కాంట్రాక్ట్ కార్మికుల వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఇక్కడ లేదు. దీంతో వీరు లేబర్ గేటుకు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్లపై తమ టూ వీలర్లను నిలిపి హడావుడిగా తమ విధులకు వెళ్లిపోతుంటారు. కొంత మందికి ఓటీ ఉంటుంది. వారు రాత్రి 8 గంటల సమయంలో వస్తుంటారు. ఆ వేళలో లేబర్ గేటు సమీప ప్రాంతాలు చీకటిగా ఉండటం, అది కొంత మంది దొంగలకు అనుకూలంగా మారడంతో అక్కడ పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తుంటారు. ద్విచక్ర వాహనాలు మాయమైన సంఘటనలు కూడా ఉన్నాయని పలువురు కార్మికులు చెబుతున్నారు. గతేడాది ఇక్కడ పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో క్రైం పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. దీంతో దొంగతనాలు తగ్గినా.. పెట్రోల్ మాత్రం మాయమవుతూనే ఉందని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమ సమస్యను దృష్టిలో ఉంచుకుని లేబర్ గేటు ప్రాంతంలో పార్కింగ్ సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం వద్దు



వెంకన్నపాలెంలో కాలువను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: వార్డులో ఎక్కడైనా వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తున్నట్టు తన దృష్టికొస్తే క్షమించేది లేదని శానిటరీ సిబ్బందిని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ హెచ్చరించారు. వార్డులోని వెంకన్నపాలెంలో శనివారం ఉదయం శానిటరీ, మలేరియా అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. వెంకన్నపాలెంలోని వీధి కాలువలు, మైదాన స్థలంలో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గుర్తించారు. తక్షణం వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని హెల్త్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. అనంతరం ఆర్‌కే పురంలో కార్పొరేటర్ సుధ పర్యటించారు. అక్కడి మహిళలు తాగునీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. పర్యటనలో పార్టీ నాయకులు చట్టి నూకరాజు యాదవ్, ఆడారి నాగరాజు, వార్డు హెల్త్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

24న పోలమాంబ జాతర



దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు పరిధి కుమ్మర వీధిలో వెలసిన బహుముఖ రూపాల పోలమాంబ 65వ వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 23, 24 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం రాట కార్యక్రమం నిర్వహించారు. పలువురు ముత్తైదువులు రాట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ నెల 23న తొలేళ్ల సంబరం జరపనున్నారు. 24న పరస మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద నిప్పుల గుండం, భక్తుల సమక్షంలో ముత్తైదువులతో ఘటాభిషేక ఉత్సవం, సాయంత్రం 5 గంటల నుంచి పురవీధుల గుండా ఊరేగింపు, విద్యుత్ దీపాలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పౌరాణిక వేషధారణలు, సాముగరిడీలు, దాసుళ్ల సందళ్లు, డీజే వాయిద్యాల హోరుతో మహోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25 మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి పరస మహోత్సవంలో పాల్గొనాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



వర్కుషాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకట శేషయ్య



క్షేత్రస్థాయిలో జంతువుల ఎన్‌క్లోజర్లను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఎంవీపీకాలనీ : వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రొఫెసర్ వెంకట శేషయ్య అన్నారు. ఏపీలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అటవీశాఖ అధికారుల కోసం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో నిర్వహిస్తున్న వర్కుషాప్ 2వ రోజు కొనసాగింది. 2వ రోజు కార్యక్రమంలో భాగంగా జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులతో పాటు పలు రకాల జునోటిక్ వ్యాధులను నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట శేషయ్య మాట్లాడుతూ జంతువుల్లో వ్యాపించే వ్యాధుల నిర్ధారణ, శాంపిల్స్ సేకరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దీంతో పాటు మృతి చెందిన జంతువులను పరీక్షించే విధానం, వాటి అంత్యక్రియల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జూలోని పలు జంతువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం వర్క్‌షాపునకు హాజరైన ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పలు జంతువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమజతో పాటు జూ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఏసీఎఫ్ మంగ తదితరులు పాల్గొన్నారు.

'లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు ఇవ్వాలి'



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: లబ్ధిదారులకు తక్షణం టిడ్కో ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు. అలాగే పేదలకు ఇచ్చిన స్థలాల్లో వారికి ప్రభుత్వమే ఉచితంగా ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. 59వ వార్డు నక్కవానిపాలెం సచివాలయం వద్ద, 60వ వార్డు వాయుపుత్ర కాలనీ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం, సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడాల రాంబాబు, గండి అప్పారావు, కొక్కడ గోపాల్‌రావు, శ్రీలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞానాన్ని అందించండి



సర్టిఫికెట్లు అందజేస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూక్యాంపస్: జ్ఞానాన్ని సముపార్జించడం ఎంత ముఖ్యమో ఆ జ్ఞానాన్ని విద్యార్థులకు పంచడం అంతే అవసరమని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. శనివారం ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో ఉన్నత విద్య మండలి, కామన్వెల్త్ ఎడ్యుకేషనల్ మీడియా సెంటర్ ఫర్ ఏషియా, ఏయూ సంయుక్తగా నిర్వహించిన 21వ శతాబ్దపు నైపుణ్యాలు-బోధన పద్ధతుల సదస్సు ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ విద్యార్థులకు వర్తమాన జ్ఞానాన్ని అందించే ప్రక్రియలో విభిన్న నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. 21వ దశాబ్దంలో బోధన పద్ధతులను నవీకరించుకుని వాటిని విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉపయుక్తంగా అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. నూతన విద్య విధానంలో వచ్చిన మార్పులను ఆకళింపు చేసుకుంటూ వీటిని అనుగుణంగా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ దినకర్ రెడ్డి, కార్యక్రమ గౌరవ అతిథి హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకట కృష్ణ, కార్యక్రమ సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భాషలపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తదితరులు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన భాషలపై రుషికొండలో గల గిరిజన భవన్‌లో శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడే కోయ, సవర, ఆదివాసీ ఒరియా, జాతపు, కువి, కొండదొర భాషలు వంటి లిపి లేని గిరిజన భాషలను నిర్మించిన ఎంటీపీ - ఎంఎల్‌ఈ ఉపాధ్యాయ శిక్షణ మాడ్యూళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో మాతృభాష ఆధారిత బహుభాష విద్యను సమగ్ర విద్య, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడానికి ఈ వర్క్‌షాప్ కృషి చేస్తుందన్నారు. బోధన, అభ్యాసం, నైపుణ్యం, అభివృద్ధి, పిల్లల అభ్యాస అలవాట్లు అంచనా వేయడం, ప్రాథమిక స్థాయిలో లేదా మాతృభాషలో చదవడం, ఇతర భాషల సహాయంతో విద్యారంగాన్ని బలోపేతం చేసే అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రకాల అభ్యాసాల కార్యకలాపాలను నేరుగా అమలు చేయడానికి ఈ మాన్యువల్ ఉపాధ్యాయులకు సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు వైద్య పరీక్షలు



డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

గోపాలపట్నం: విశాఖ రవాణా శాఖ కార్యాలయంలో ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ రాజారత్నం మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ నెలరోజులకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు, బీపీ, షుగర్, గుండె పరీక్షలు చేయించుకోవడం మంచిదని పేర్కొన్నారు. స్కూల్ బస్సులు, ఆటోలు నడిపే వారు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు చేయకుండా.. ప్రమాదాల బారిన పడకుండా వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో 167 మంది ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు. ఆర్‌టీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానమే కొనసాగించాలి



ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు, సభ్యులు

గోపాలపట్నం: నూతన పెన్షన్ స్కీమ్ స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు వద్ద సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఓపీఎస్ అమలుకు కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. కాని కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నెల 21న ఢిల్లీలో 'రెయిజ్ వాయిస్ ఎగైనెస్ట్ ఎన్‌పీఎస్' కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. దానికి మద్దతుగా ఆందోళన నిర్వహించామని పేర్కొన్నారు. ఓపీఎస్ సాధించే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు. కార్మికులు పాల్గొన్నారు.

ఐటీఐలో యోగి వేమన జయంతి



వేమన పద్యాల పోటీల్లో విజేతలతో సత్తి సునీల్‌రెడ్డి తదితరులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రొఫెసర్ ఉమాదేవి ఆధ్వర్యంలో శనివారం యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కేంద్ర సీఐడీ రిటైర్డ్ ఎస్పీ సత్తి సునీల్‌రెడ్డి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన పద్యాల గొప్పదనం నేటి తరానికి తెలిసేలా విద్యార్థులకు వివరించాలన్నారు. నాటి సాంఘిక దురాచారాలను ఖండిస్తూ పండితపామరులకు కూడా అర్థమయ్యేలా వేమన గొప్ప సందేశాలు ఇచ్చారన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట రామారావు, పి.ఫ్రాన్సిస్ ఆనంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగికి టోకరా

సీతమ్మధార: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించారని ఓ బాధితుడు ఫోర్త్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా.. విజయనగరం జిల్లా జమ్మనారాయణపురానికి చెందిన కాయల చంద్రశేఖర్ మధురానగర్ ఇన్ హోటల్ ఎదురుగా సర్వేక్ష అకాడమీలో ఏడబ్ల్యూఎస్ కోర్సు నేర్చుకోవడానికి 2021 మార్చిలో చేరాడు. ఈ కోర్సు నిమిత్తం రూ.85 వేలు చెల్లించాడు. మూడు నెలల్లో కోర్సు పూర్తవుతుందని నిర్వాహకుడు తెలిపాడు. పది నెలలు దాటినా ఇంకా కోర్సు అవ్వలేదని చెప్పి.. తన స్నేహితుడి వద్ద సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని, అందుకు రూ.1.10 లక్షల అవుతుందని నమ్మించాడు. ఆ మొత్తం నగదు కళిరెడ్డి దేవీకిరణ్‌కు కట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉద్యోగం రాలేదని అడగ్గా.. ఇదిగో వేయిస్తానని చెప్పి రోజూ తిప్పిస్తుండటంతో ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావుకు చంద్రశేఖర్ ఫిర్యాదు చేసి తన న్యాయం చేయాలని కోరాడు.

ఎన్నెన్నో అందాలు.. పుష్పాల వర్ణాలు



ఫ్లెరోమా పుష్పాలు



దయాంథస్



దాలియా



గజానియా



రైతుబజార్‌లో నర్సరీలో పూల మొక్కలు

ఏయూక్యాంపస్: శీతాకాలంలో విభిన్న రకాలు పుష్పాలు విరివిగా కనిపిస్తాయి. పెదవాల్తేరులోని రైతుబజార్ ఆవరణలో ఉన్న నర్సరీలో విభిన్న రంగుల పుష్పాలతో మొక్కలు విక్రయిస్తున్నారు. చామంతి, బంతి రకాలతో పాటు దాలియా, ఫ్లెరోమా, దయాంథస్, గజానియా వంటి విభిన్న జాతుల మొక్కలు ఇక్కడ విక్రయిస్తున్నారు. ఒక్కో మొక్క రూ.50కి విక్రయిస్తున్నారు. రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు ముచ్చటపడి ఈ మొక్కలను కొనుగోలుచేస్తున్నారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు, అర్చకులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాలకు అభినందనలు



కొణతాల నరసింగరావు

కంచరపాలెం: రాష్ట్ర గవర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవీ కాలాన్ని ఏడాదికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల నరసింగరావును శనివారం గవర సంఘం నాయకులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ తనపై బాధ్యత ఉంచి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొనసాగిస్తునందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌లకు నరసింగరావు కృతజ్ఞతలు తెలిపారు.

23 నుంచి 'హ్యూమన్ జెనిటిక్స్' సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం హ్యూమ న్ జెనిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 23 నంచి 25వ తేదీ వరకు విభాగ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షుడు ఆచార్య జి.పద్దయ్య తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా × న్యూ జెనిటిక్స్ అండ్ ఇట్స్ కాంట్రిబ్యూషన్స్ టు హ్యూమన్ హెల్త్ అండ్ వెల్త్ ₹ అంశంపై సదస్సును నిర్వహిస్తున్నామన్నారు.